
సాయంత్రం ఆరు గంటలయింది. భాగ్య నగరం నడిబొడ్డున రవీంద్ర భారతి చక్కగా ముస్తాబు చేసుకుని కళకళలాడుతూ ఆహ్వానితులకి స్వాగతం పలుకుతోంది.

# 'కళాకారుడు'

## — కస్తూరి —



ఆనాడు అక్కడ కనకం ఆర్ట్స్ అసోసియేషన్ వారు భారీ ఎత్తున ఏర్పాటు చేసిన సాంస్కృతిక ఉత్సవం జరుగబోతూంది. ఏడేళ్ళ క్రితం, అదే రోజున ఆ సంస్థ స్థాపించబడింది. ప్రతి ఏడు అసోసియేషన్ సభ్యులు ఆ సంస్థ పుట్టిన రోజు వేడుకలని వైభవంగా జరుపుకోవటం ఆనవాయితీ.

ప్రతి ఏడూ, ప్రముఖులు కొందరిని ఎంపిక చేసి వారికి సన్మానం చేయటం వారి ఆచారం.

ఈసారి, కనకం ఆర్ట్స్ వారికి గౌరవనీయులైన ఒక మంత్రి గారితో, కీర్తి ప్రతిష్ఠలున్న ఒక సినీ కళాకారుడికి సన్మానం చేయించాలన్న ఊహ కలిగింది.

ఇప్పుడు ఫీల్డులో స్టార్ వెలుగుతున్న వారిని పిలవటమూ, సన్మానించటమూ అంటే చాలా అవుతుందని లెక్కలు వేసేరు. 'ఒక వెలుగు వెలిగి, ఆరిపోయిన తార అయితే బేషుగ్గా వుంటుంది'. అని సలహా ఇచ్చేడొక సభ్యుడు. మిగతా అందరికీ ఆ ఆలోచన వచ్చింది. ఒకనాడు నటుడిగా సినీ ప్రపంచాన్ని ఏలిన గోపీనాథ్ వారికి గుర్తుకి వచ్చేడు.

నటశేఖర, నట సార్వభౌమ నట సామ్రాట్టు బిరుదాంకితులైన గోపీనాథ్ గారికి అంతా కలిసి సన్మానం చేయటానికి నిశ్చయించి అతనికి ఉత్తరం వ్రాసేరు.

ఆ ఉత్తరం గోపీనాథ్‌ని చేరింది. తన మూడు గదుల చిన్న ఇంటిలో వసారాలో మంచమ్మీద పడి మత్తులో మగతగా దొర్లుతున్న గోపీనాథ్ ఆ ఉత్తరం చదివేడు. అతనికి ఒక్కసారిగా మత్తు దిగిపోయింది.

అతను స్ప్రింగులా లేచి కూర్చుని "ఏమే?... ఇలారా.... రా!..." అంటూ అరచి సతీమణిని పిలిచి "ఇది చూడూ!..." అంటూ ఆ ఉత్తరాన్ని చూపేడు. ఆమె అది చదివి శూన్య దృక్కులతో గుడ్లు తేలవేసి, అతని వంకకి చూసింది.

"ఏమంటావిప్పుడు?... ఈ ఇంట్లో గోపీనాథ్ అంటే మీ కందరికీ చచ్చిన వాడితో సమానం అయ్యేడు. కాని, అవతల ప్రజలు, నా అభిమానులు నన్ను మరచిపోలేదు." ఉద్వే

గమూ, గర్వమూ నిండిన స్వరంతో అన్నాడు.

"కళాకారుడికి నిజమైన ఉత్సాహాన్నీ, ప్రోత్సాహాన్నీ ఇచ్చేది అభిమానులే..." ఆ ఉత్సాహంతో కొత్తగా ఊపిరి వచ్చినట్టు ఆనందంతో బిగ్గరగా అరుస్తున్నాడు గోపీనాథ్.

అతని ఆ ఆనందాన్నీ, ఉత్సాహాన్నీ, అతని భార్య కానీ కడుపున పుట్టిన పిల్లలు కానీ పంచుకోలేక పోయినారు. అతనికి చేతనైన వృత్తి ఒక్కటే, అది 'నటన'. చిత్తశుద్ధితో తన వయసునూ, మనసునూ నటన పట్ల కేంద్రీకరించేడు. ఆ నట జీవితానికి ఆకస్మికంగా తెర పడింది. ఆ తరువాత అతను జీవితంలో మరే రంగంలో రాణించలేక పోయేడు. చివరికి ఎందుకూ చేతకాని వాడిగా, ఒక తాగుబోతుగా, అయిన వారికి గుదిబండగా మిగిలిపోయేడు.

**ఈ ప్రపంచంలో ఏ కూలి వాడైనా తన కండలని నమ్ముకుని తుది వరకు బ్రతుకుని ఈడ్చగలడేమో కాని, ఒక కళాకారుడు తన కళని నమ్ముకుని చచ్చేవరకు బ్రతుకలేడన్న నిజాన్ని గ్రహించలేక పోయేడు గోపీనాథ్.**

అతనికి ఎంతసేపూ తన నటనని గురించీ తన గత వైభవాన్ని గురించీ తలపోయటం తప్పితే మరొకటి తోచదు.

కూర్చుని తింటే కొండలు కరిగి పోతాయి. గోపీనాథ్ గడించిన ఆస్తి, అతన్ని సినీ పరిశ్రమ చిన్న చూపు చూడడం ప్రారంభించిన తొలి దశలోనే కరిగిపోయింది. తమ లేమితనాన్ని కప్పిపుచ్చుకోవటానికి అతను చేసిన ఆడంబరాలకి, అనవసర ఆర్భాటాలకీ ఖర్చు అయిపోయింది.

అకారణంగా కన్నతల్లి విదిలిస్తే, చీదరించుకుంటే విలవిలలాడిపోయే పసిబిడ్డలా అలమటించేడు ఇన్నాళ్ళు. ఈనాడు ఆ కళామతల్లి కనికరించింది. అనురాగంతో తనని పిలుస్తున్నది. పిలవటమే కాదు "ఒకనాటి నీ బిడ్డ యెంతటి గొప్ప వాడో! చూసేరా?" అని అందరికీ చాటి చెప్పబోతున్నది. అన్న భావంతో అనుభూతితో పులకరించిపోతున్నాడు.

గోపీనాథ్ అంతగా ఎదురు తెన్నులు చూస్తున్న సన్మాన గడియ రానే వచ్చింది.

ఆడిటోరియం లోపల వేదిక రంగు రంగుపూలతో నేత్రపర్వంగా అలంకరించబడి వుంది.

ఆ పూల తోరణాల మధ్య నిండుగా ఆసనాన్ని అలంకరించేరు మంత్రిగారు. మంత్రిగారి ప్రక్క పురప్రముఖులు, వారి ప్రక్కగా గోపీనాథ్ కూర్చుని వున్నారు.

కన్నుల పండుగగా ఏర్పాటు అయిన ఆ ఉత్సవాన్ని, తన యెదురుగా వున్న అనంత జన సమూహాన్ని చూస్తూ, ఆనందంతో యేదో గొణుక్కుంటూ తూలుతున్నాడు గోపీనాథ్.

అతని ఆనందానికి కారణం కనకం ఆర్ట్సు వారే అయినా, అతను తూలటానికి కారణము మరొకటి వున్నది. అది అతను త్రాగిన విస్కీ ప్రభావం.

నిజానికి గోపీనాథ్ ఆ రోజు త్రాగకూడదనుకున్నాడు. కాని ఇంకొద్దిసేపట్లో మంత్రిగారు తన స్వహస్తాలతో తనకి సన్మానం చేయ బోతున్నారన్న ఊహ, అతన్ని నిలువనీయటం లేదు.

రేపీపాటికి అన్ని పేపర్లలోనూ తన మొహం


# కేశవర్ధిని...
## పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం



పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనె
అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన
శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.

కొద్ది చుక్కల కేశవర్ధినిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో
కలిపి శిరోజాలకి రోజూ రెండుసార్లు బాగా రాస్తే అవి
ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగ
లాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఈరోజునే కేశవర్ధిని కొనండి.
ఆరునెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.




**కేశవర్ధిని**
**తలనూనె**

కేశవర్ధిని ప్రొడక్ట్స్ మద్రాసు-600 087

O &M 2293 TG




కనిపిస్తుంది. తనని గురించిన వార్తలు వెలువడతాయి. తన కీర్తి పతాకము మరొక్క మారు తెలుగు దేశంలో ఎగురవేయబడు తుంది. అన్న ఆనందం అతన్ని ముంచెత్తి తబ్బిబ్బు చేస్తున్నది. ఈ ఆనంద సమయంలో ఒక్కమక్క పడకపోతే అతడికి తను నిఠారుగా నిలబడలేననిపించింది. మంత్రి గారి యెదుటకి ఒక్క అడుగు వేయ లేనన్న అధైర్యం ఆవహించింది. అందుకే ముందు జాగ్రత్త పడి తగు మోతాదులో విస్కీ పుచ్చుకుని వచ్చేడు.

వేదిక మీదకి కనకం ఆర్ట్స్ కార్యదర్శి ఊదా రంగు ఫుల్ సూట్‌లో హుందాగా నడచి వచ్చేడు.

అతను ముందు మాటలు క్లుప్తంగా చెప్ప టము ముగించి, శ్రీ శ్రీ శ్రీ గోపీనాథ్ గురించి చెప్పటం ప్రారంభించేడు.

"నన్ను గోపీనాథ్ గురించి రెండు మాటలు చెప్ప మన్నారు. ఆ మహానటుడి గురించి రెండు మాట లలో, రెండు వాక్యాలలో చెప్పటం యెంత కష్టమో మీకందరికీ తెలుసును."

సభలో చప్పట్లు మ్రోగేయి.

"ఈనాడు గోపీనాథ్‌గారు చిత్ర పరిశ్రమకి దూరమయినా ఒకనాటి వారి నటన, నటశేఖరుల మనుకునే వారికే పాఠాలు నేర్పుతుంది—అనటం అతిశయోక్తి కాదు."

"ఆనాటి చిత్రాల్లో వారి హావ భావ నైపుణ్యం యెంతో న్యాచురల్‌గా ఉండి ప్రేక్షకుడిని కుర్చీకి కట్టి పడవేసేది. వారి వాచికాభిన యంలోని గంభీరతమూ, వారు డైలాగులు పలికే తీరునూ, యెందరో సాటి నటీనటులు అనుక రించాలని చూసి అవస్థల పాలయ్యేరు."

"ఈనాటికీ గోపీనాథ్ నటనని, వాచికాన్ని అను సరించాలని చూసే యువ నటులు కో...కొల్లలు."

జనంలో ఈలలు, చప్పట్లు క్షణం సేపు మిన్ను ముట్టేయి.

"అంతటి కళాకారుడు ఈనాడు మా సభని అలంకరించటం మా అదృష్టంగా భావిస్తూ, మేము చేయబోయే సన్మానాన్ని చంద్రునికో నూలుపోగుగా భావించి స్వీకరించాలని కోరుతు న్నాము."

అమృత ధారలలాటి అతని మాటలు వింటూ మైమరచిపోయేడు గోపీనాథ్.

అతను ఆ మైమరపులో ఉండగానే మంత్రి గారు లేచి వచ్చి పట్టు శాలువాని కప్పి అతని నుదుట తిలకాన్ని దిద్దేరు. గోపీనాథ్ శరీరము మోయలేనంత బరువైన పూల మాలని అతని మెడలో వేసేరు.

ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో హాలు హోరెత్తి పోయింది. గోపీనాథ్ పట్టరాని సంతసంతో జన సందోహాన్ని పరికించి చూసేడు.

'యెన్నాళ్ళకి తను మళ్ళీ ప్రజల మధ్యకి వచ్చేడు?'

'ప్రజలు తనని మరిచిపోయేరనుకున్నాడు.'

'విధి తనని చిన్నచూపు చూసిందనుకున్నాడు.'

'లేదు...లేదు. ప్రజలకీ కళాకారుడికీ మధ్య ఉన్న ఈ అనుబంధము యేనాటికీ తెగిపోనిది' అనుకుంటే అతని కళ్ళ నిండుగా అశ్రువులు నిలి చేయి.

"గోపీనాథ్‌గారు మాట్లాడాలి. మాట్లా డాలి..." యెవరో అరిచేరు. హాలంతా అదే మాటని బలపరిచేరు.

"గోపీనాథ్‌గారు! ప్రజల కోరికను మన్నిం చాలి. మీ అభిమానులు వేయి గొంతుకలతో మిమ్మల్ని పిలుస్తున్నారు" సవినయంగా విన్న వించేడు కార్యదర్శి.

ప్రజల వెర్రి అభిమానాన్ని సంతోషంతో, సంభ్రమంతో తిలకిస్తూ, పులకించిపోతున్న గోపీ నాథ్‌కి, కార్యదర్శి మాటలు చెవికి సోకనే లేదు.

"గోపీనాథ్ గారూ! రావాలి..." అతను మళ్ళీ నొక్కి పిలిచే సరికి తన ఊహాలోకంలో నుండి ఇవతలికి వచ్చి గబుక్కున లేవబోయాడు.

శరీరం స్వాధీనంలో లేక చిన్నగా తూలి పడబో యేడు. అది గమనించిన కార్యదర్శి "స్కౌండ్రల్ యిక్కడికీ త్రాగి వచ్చేడు" అని మనస్సులో తిట్టుకుని—

"ప్రేక్షకులు క్షమించాలి. గోపీనాథ్‌గారి ఆరోగ్యం బావుండనందున వారు మాట్లాడ లేక పోతున్నందుకు వింతిస్తున్నాము" అన్నాడు నాటకీయంగా.

గోపీనాథ్ మనస్సు చివుక్కుమనగా కార్యదర్శి వైపు నిదానించి చూసేడు. మైకు ముందు నించున్న అతను అదోరకంగా చూసేడు గోపీ నాథ్ వైపు.

ఆ చూపులోని తిరస్కారానికి నీరుకారి పోయేడు గోపీనాథ్. అంతవరకూ అతనిలో చెలరేగిన ఉత్సా హాన్నంతా యెవరో లాగేసినట్టు డీలాపడిపోయేడు.

'ఇంతకు క్రితం తనని యింద్రుడు, చంద్రుడు అంటూ పొగిడిన అతనేనా? యీతను?'

ఆ చూపులోని ఆ భావం, ఆ నిరసన గోపీ నాథ్ పసికట్టలేనివి కాదు.

గోపీనాథ్‌కి అతని చూపుల్లో తన భార్యా బిడ్డల రూపాలు కనిపించేయి.

తనని తిరస్కరించిన సినీ రంగంలోని వ్యక్తుల కుయుక్తులు కనిపించేయి.

హాలంతా చప్పట్లతో మ్రోగిపోతున్నది "గోపీ నాథ్ లేవాలి. మా కోసం ఒక్క ముక్క మాట్లాడాలి" అన్న అరుపులతో ఆడిటోరియం దద్దరిల్లిపోతున్నది.

జీవితంలో పైకి రావటానికి ప్రతి వ్యక్తికీ కావ లసింది—కొద్దిగా ప్రేమ, ఆదరణ, ప్రోత్సాహం. అప్పుడే పుట్టిన పసిబిడ్డ కేర్ మని మొద టిసారిగా యేడ్చేది తల్లి ప్రేమ కోసమే.

తల్లి గుండెలకి హత్తుకుని అందించే ప్రేమా మృతమే ఆ బిడ్డ పెరుగుదలకి కారణం.

నిజమైన కళాకారుడు పసిబిడ్డడి వంటివాడే. అభిమానుల ప్రేమ, ఆదరణ, ప్రోత్సాహం, సద్విమర్శలూ అతని యెదుగుదలకి సోపానాలు.

గోపీనాథ్ కూడా అటువంటి కళాకారుడు. అభిమానులు అందించే ఉత్సాహమే, తన ఊపి రిగా భావించిన ఉత్తమ కళాకారుడు. ప్రజలలో యింకా మాసిపోని, ఆ అభిమానాన్నీ, ఆదరాన్ని చెమ్మగిల్లిన కళ్ళతో తేరిపార చూస్తూ లేవబో యేడు గోపీనాథ్. అభిమానుల హర్షాల వర్షం ఆనందంతో పాటూ ఆవేదననీ కలిగిస్తున్నది అత నికానాడు.

ఒకవైపు దుఃఖం, మరోవైపు ఆనందపు కెరటం, రెండింటికీ సమన్వయంలేని అసహాయ స్థితి.

ఆవేశమూ, ఉద్వేగమూ, నీరసమూ, నిస్స త్తువ కలియబడి పోరాడుతున్నట్టుగా గుండెలో నుంచి ఒక అలౌకికమైన స్థితియేదో తోసుకుని వచ్చింది. గోపీనాథ్ శరీరంలోని నరాలన్నింటినీ తన స్వాధీనంలోకి తెచ్చుకుని, లేచి నిలబడి, కృతజ్ఞతతో చేతులు జోడించబోయేడు. అతడి వెన్నులోంచి గుండెలోకి యేదో నరం పట్టి పిండే సినట్టు బాధ, సగం పైకిలేచిన చేతులు క్రిందికి వాలిపోయాయి. గోపీనాథ్ వెనక్కి కుర్చీలోకి శాశ్వతంగా ఒరిగిపోయేడు.

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్